

# ఏది వ్యూహం?

కథ

విహారి

**కూరగాయల మార్కెట్ వున్న రోడ్‌కి సరిగ్గా అవతలివైపు వస్తోంది- కూరలూ, పండ్లూ తాజాగా అందించే మాల్!**

**'ధరలు చవగ్గా ఉంటాయిట. రైతుల దగ్గర్నుంచీ నేరుగా సరుకు కొనుగోలు చేసి అమ్ముతారుట. ఆ పోటీ తట్టుకోవడం కష్టం. కొన్ని వేల కోట్ల రూపాయల్ని కేటాయిస్తూ ఈ వ్యాపారంలోకి పెద్ద పెద్ద కంపెనీలు ప్రవేశిస్తున్నాయి'. - ఇదీ టాక్ ఆఫ్ ది టౌన్!**

విషయం విన్నప్పట్నుంచీ-

మార్కెట్ దుకాణదారుల్లో ఆందోళన. ఇది వారి భవిష్యత్తుకి సంబంధించిన సమస్య. వారి గుండెల్లో రాయి పడింది. యూనియన్‌లో కదలిక. మీటింగ్‌లు జరుగుతున్నాయి. ఏ పరిష్కారమూ తోచదు. సభ్యుల కాళ్లల్లో నీరసం, కళ్లలో దిగులు.

***

ఖంగు ఖంగున దగ్గు. ఖళ్లు ఖళ్లుమని కళ్లె. శరీరాన్ని అతలాకుతలం చేస్తోంది. నారాయణని ఆ దగ్గు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మొన్న అర్ధరాత్రి హాస్పిటల్‌కి వెళ్లి నిన్న ఇంటికి వచ్చారు. 'ఎటాక్' తీవ్రంగా వచ్చినప్పుడు ఇది మామూలయిపోయింది. నిన్న యింటికి వచ్చినప్పటి నుంచీ తెరలు తెరలుగా వస్తోంది. మనిషి ఆయాసపడిపోతున్నాడు.

'ఈ ఉబ్బసం రోగం చంపదు, హాయిగా బతకనివ్వదు' అనుకుంటూ మంచంలో మసిలి పక్కకి తిరిగాడు, నారాయణ. ఊపిరితిత్తులు కొలిమి తిత్తుల్లా ఎగిరెగిరిపడుతున్నె.

గాయత్రి వచ్చి ఒక్క చుక్క వేడి వేడి కాఫీ అందించింది. తాగాడు. ప్రాణం తేరుకున్నట్టయింది. తువ్వాలుతో మొహాన్న పట్టిన చెమట తుడిచి, టేబుల్ ఫ్యాన్‌ని ఆన్ చేసింది. అది వాళ్ల శోభనం నాటిది. నారాయణ దగ్గులాగానే, బరబర, కరకర, ఖంగు ఖంగు మోత చేస్తూ తిరగాలనే ప్రయత్నం మొదలెట్టింది.

ఇంతలో పక్క గుమ్మంలోంచీ లలిత వచ్చింది. "ఇవ్వాళ జ్వరమేం లేదుగా" అంటూ వాకిట్లో గుడ్డలారేయటానికి వెళ్లింది. "లేదు వదినా. ఈ దగ్గూ ఆయాసమే దుంప తెంచుతోంది" అని ఆమెకు సమాధానం చెప్పి, తాను లోపలికి వెళ్లింది గాయత్రి.

ఆరేళ్ల క్రితం- నాగరాజు సహాయంతోనే మార్కెట్లో చిన్న దుకాణం పెట్టుకోగలిగాడు, నారాయణ. నాగరాజూ, అతని భార్య లలిత, పిల్లలు - సురేశ్, ఆశ- తల్లీతోడులా, ఆత్మీయంగా మెలగుతారు. సురేశ్ ఇంటర్లోనూ, ఆశ తొమ్మిదో తరగతిలోనూ ఉన్నారు. ఆరు గదులు ఉన్న ఒక్కటే పెద్ద ఇల్లుని అద్దెకు తీసుకుని- రెండు కుటుంబాలూ- చెరో మూడు గదుల్లో ఉంటున్నారు. అద్దె మొత్తానికి నాలుగు వేలు. ఇంటికి ఉమ్మడి వసారా వుంది. అక్కడే- ఇప్పుడు నారాయణ పడుకుని వుంది.

మంచంలో పక్కకి తిరిగాడు నారాయణ. పిల్లలిద్దరూ అప్పటికప్పుడే తమ పనుల మీద బయటికి పోయారు. కిశోర్ ఇంటర్ పూర్తి చేసి ఎంసెట్, ఐఐటీ రాస్తున్నాడు. అపర్ణ టెన్త్‌తో ఆపేసింది. ఖాళీగా ఉండకుండా ఎదురుగా వున్న క్లాత్ స్టోర్స్‌లో సేల్స్‌గళ్‌గా చేరింది.

దుప్పటి సర్దుకుని సరిగా కప్పుకున్నాడు. ప్లాస్టిక్ నవారు మంచం సకిలించింది. "టైమెంతయిందీ?" అడిగాడు.

"పది దాటుతోంది" అంది గాయత్రి- లో గుమ్మంలోంచీ.

***

"రోడ్ రోడ్‌కీ మాల్సొస్తున్నాయని మురిసిపోతున్నావ్, బాగానే వుంది. ముందు లోకల్ మార్కెట్‌ల నడ్డి విరుగుతుంది. ఆ తర్వాత మొనోపొలీ మొదలవుతుంది. ఓపెన్ మార్కెట్ మాయాజాలం. ప్రపంచీకరణం ప్రభావం". చాలా దృఢంగా చెప్తోంది అపర్ణ.

అక్కవైపు విసురుగా చూశాడు కిశోర్. కుర్చీలో కూచుని ఏదో మేగజైన్ చదువుతోందామె. "కథలూ, కవితలూ చదివి చదివి బుర్ర బాగా ఖరాబయిపోయింది నీకు. ప్రతి మార్పునీ ప్రపంచీకరణంకి లంకె పెట్టటం, బీపీ పెంచుకోవటం. తమ్ముడి వైపు గుర్రుగా చూసింది అపర్ణ. "బోడిగుండుకీ మోకాలికీ ముడేయటమంటే ఇదే. ఇంకా ఎంట్రన్స్ టెస్టే కాలేదు గానీ నీ ఐఐటీ ఊహ ఇప్పుడే డాలర్ల చుట్టూ తిరుగుతోంది" అంటూ లేచి విసురుగా లోపలికి వెళ్లిపోయింది.

"గ్రేట్ ఎస్కేపిస్ట్. అన్నీ ఫ్యాషన్ మాటలు. ప్రశ్నిస్తూ ముందుకు పోతే చతికిలబడతారు. వీళ్లందరిలో అభద్రతా భావం ఎక్కువ. జ్ఞాన సమాజాన్ని ఆహ్వానించలేరు" పైకే అనుకున్నాడు కిశోర్.

గుమ్మం దగ్గర కూచుని కూతుర్నీ, కొడుకునీ విన్నది గాయత్రి. ఆలోచనలో పడింది. వాదాలూ గట్రా ఆమెకి తెలీవు. మాల్ వ్యవహారం మనసు మనసులో లేకుండా చేస్తోంది. దానికి తోడు నారాయణ అనారోగ్యం. ఒకరోజు దుకాణం తెరిస్తే రెండు రోజులు బంద్‌లా ఉంది వ్యాపారం. అపర్ణ పెళ్లి... రేపే ఏమవుతుందోనన్న భయం నిండి వున్నదామె మనస్సులో. వయసు నలభై అయినా, ఆలోచనలతో, బతుకు భయంతో, ఆందోళనలతో వెంట్రుకల నలుపు పోయింది. పళ్లల్లో మెరుపూ పోయింది. గాలి తీసిన బుడగలా తయారవుతోంది మనిషి... గాయత్రిని చాలా ఆలోచనలు ముసురుకోసాగేయి.

"సరే... మాకు అన్నం పెట్టమ్మా" అన్న కిశోర్ పిలుపుకు ఉలిక్కిపడి ప్రస్తుతంలోకొచ్చింది గాయత్రి.

"నాకూ వేడిగా కొంచెం ఏ బూస్టో కలిపివ్వు" అన్నాడు నారాయణ?

కొంగుతో కన్నొత్తుకుని కదిలింది గాయత్రి. ఎందుకో కుడికన్ను అదురుతోంది!

***

అందమూ, ఆరోగ్యమూ, యౌవనమూ, శరీర సౌష్టవమూ కలిగిన మనిషిలా కళకళలాడుతూ రంగులద్దుకుని, మస్తుగా ముస్తాబై నిలబడింది మాల్. అమ్మకాల హంగామా మొదలైంది. ప్రచారం భారీ ఎత్తున జరిగింది. నెలలు గడుస్తున్నాయి.

మాల్ రద్దీ రద్దీ కాదు. క్యూలో జనం. అనేక స్కీములు. ప్రవేశ ద్వారం దగ్గర ఫుడ్ కోర్టూ, ఛాట్‌లూ, ఫ్రూట్ జ్యూస్‌లూ వచ్చేసినై. కావలసినంత ఖాళీస్థలం. పిల్లలకు వీడియోగేమ్స్, యువతీ యువకులకు క్రికెట్ చూసేందుకు బిగ్ స్క్రీన్ వచ్చాయి.

మార్కెట్ పరిస్థితిలో నెమ్మదిగా మార్పువచ్చేస్తోంది. కల తప్పుతోంది. ఆందోళన మబ్బు ముసురుకొస్తోంది. అమ్మకాల జోరు తగ్గింది.

సరుకు కదలటం మందగించింది. ఆదాయాలు పడిపోతున్నె. బతుకు చక్రంలో నట్టు వదులవుతోంది. సంసారాల బరువు తెలిసొస్తోంది.

మార్కెట్ ఆవుకి రోగమొచ్చింది. రేపో మాపో వట్టిపోతే?

దుకాణాదారుల్లో అలజడి, అసహనం, పైకి చెప్పుకోలేని మూగబాధ. మాటల్లో ఉన్నట్టుండి కట్టలు తెంచుకుంటున్న పొంతనలేని ఆక్రోశం.

ఎవరో కనిపించని రాక్షసుడు తొడగిల్లి నోరు మూసినట్టుంది. వాళ్ల అవస్థ. రోజులు వడగాడ్పుని సాగిస్తున్నై.

ఉన్నట్టుండి, ఒక రాత్రి పల్లె నుంచీ కబురొచ్చింది నారాయణకి. తండ్రి చనిపోయాడు. కుటుంబమంతా పరిగెత్తుకుపోయారు. పదిహేను రోజుల పాటు దుకాణం తెరవలేదు. తిరిగి వచ్చేసరికే వారం మిగిలివుంది- కిశోర్ టెస్ట్‌కి. అపర్ణకి- 'మేం వేరే సేల్స్ మన్'ని పెట్టుకున్నా'మని ఉద్యోగానికి ఉద్వాసన చెప్పారు, షాపువాళ్లు. పల్లెల్లో స్నానాలూ, కర్మకాండలూ, అకాల భోజనాలూ- వలన నారాయణ అనారోగ్యం బాగానే ప్రబలింది. తల్లి కూడా వాళ్లతో వచ్చింది.

కళ్లు మూసుకుని, చేతుల్లో గాలిలో దణ్ణం పెడుతూ ఎవరినో ప్రార్థిస్తుంది గాయత్రి. తానుగా వెళ్లి దుకాణం తెరచి, వ్యాపారం చూడలేదు. పిల్లలు చేతులెత్తేశారు. నారాయణ నిస్సహాయతలో ఆచరణకి పనికిరాని ఆలోచనల్లో కుంగిపోతున్నాడు. నాగరాజు మాటసాయం, అంతో ఇంతో డబ్బు సాయం చేస్తున్నాడు. అదొక తాత్కాలిక ఉపశమనం, అంతే! ఆకాశానికి ఎవరైనా మాసికలేం వేయగలరు?!

***

ఆరోజు శుక్రవారం. తెల్లవారటమే సంచలనంతో తెల్లవారింది.

వార్తాపర్వతం పగిలింది. శతసహస్రంగా అభిప్రాయ శకలాలు!

తెల్లవారుఝామున ఓ గుంపు మాల్ మీద దాడి చేశారు. అక్కడి వస్తువులన్నీ ధ్వంసమైనై. మార్కెట్ యూనియన్ లీడర్లనీ, మరికొంతమంది దుకాణందారుల్నీ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

నారాయణా, నాగరాజూ పోలీస్‌స్టేషన్‌కి పరిగెత్తారు. అప్పటికప్పుడే పరిస్థితి నానా హంగామాగా, ఉద్రిక్తంగా వుంది. అరుపులూ, కేకలూ, డౌన్‌డౌన్‌లూ, పిడికిలి బిగింపులూ, ఆవేశకావేషాల వీరంగం, మీడియా వారంతా వచ్చేశారు. వ్యాఖ్యలూ, వ్యాఖ్యానాలూ జరిగిపోతున్నై.

ఇక్కడిలా వుండగానే ఎవరో వార్త తెచ్చారు. మార్కెట్ మీదా దాడి జరిగింది. నారాయణకీ, నాగరాజుకీ గుండెలదిరినై. ఉరుకులు పరుగుల మీద వీరూ వారూ మార్కెట్‌కి వెళ్లారు. నారాయణ దుకాణం కొంత, నాగ రాజు దుకాణం పూర్తిగానూ ధ్వంసమై ఉన్నాయి. ఇద్దరికీ గుండెలవిసినై. గాయత్రీ, లలితా, కిశోర్, అపర్ణ అక్కడే వున్నారు. సురేశ్, ఆశ ఊళ్లో లేరు. సెలవలకి అమ్మమ్మగారి ఊరు వెళ్లారు. గాయత్రీ, లలితా చుట్టుపక్కలవాళ్లూ అందరూ రోదిస్తున్నారు.

దుఃఖాన్ని కళ్లల్లో దాచుకుని పిచ్చిచూపులు చూస్తున్నారు కొందరు. నారాయణ ఈ దెబ్బకి ఎక్కువ షాకయ్యాడు. భయం, అసహాయతా అతన్ని క్రుంగదీసినై. కాళ్లు చచ్చుపడినట్లయి, కుప్పకూలిపోయాడు.

ఛోటా మోటా నాయకుల హడావిడితో, దుకాణదారుల అరుపులు, తిట్లు, అభిప్రాయాలతో ఆ ప్రాంతమంతా నానా గిజాటుగా తయారైంది. నారాయణని తీసుకుని ఇంటికి వచ్చే సింది గాయత్రి.

- మధ్యాహ్నానికల్లా, దెబ్బ మీద దెబ్బగా,

కిశోర్‌ని పోలీసులు తీసుకెళ్లారు. ఇంకా కొంతమంది దుకాణదారుల పిల్లల్నీ కస్టడీలోకి తీసుకున్నారు. గాయత్రీ, నారాయణా అయితే వొకటే ఏడుపు. అపర్ణ కోపంతో ఊగిపోతోంది. నాగరాజూ, గాయత్రీ, లలితా పోలీస్‌స్టేషన్‌కి పరిగెత్తారు.

అక్కడ స్టూడెంట్సంతా గుమిగూడి భైఠాయింపు జరుపుతున్నారు. డౌన్‌డౌన్‌లు మిన్నుముట్టుతున్నై. రాజకీయవాదులు రంగ ప్రవేశం చేశారు. రాత్రి పదకొండవుతుండగా- యూనియన్ ఛైర్మన్, స్థానిక ఎంఎల్ఏ, అడ్వకేట్, వారి మందీ మార్బలం- పోలీసులతో మంతనాలు సాగించారు. మరో అర్థగంటకి కాగితాల పని అయింది. కస్టడీలో వారంతా బయటికొచ్చారు. అక్కణ్ణుంచీ సంఘటనలన్నీ వెంట వెంటనే జరిగిపోయినై. మర్నాడు ఉదయం టౌన్‌లో స్టూడెంట్స్ ర్యాలీ. మార్కెట్‌ని మూసేయించారు.

మూడు రోజుల తర్వాత, నెమ్మదిగా మామూలు పరిస్థితి నెలకొన సాగింది. అసలిదంతా ఎట్లా జరిగిందో ఇదమిత్థంగా ఎవరికీ తెలీదు. రోజులు గడుస్తున్నాయి. నారాయణ తన దుకాణాన్ని మళ్లీ తెరవలేకపోయాడు. అనారోగ్యం ఒక వంక, డబ్బు సమస్య మరో వంక అతన్ని మొహం వ్రేలాడేసేటట్లు చేసినై.

ఇటు కిశోర్ మొహంలో కళా కాంతీ లేవు. నిరుత్సాహపు ముద్దలా ఉన్నాడు. అపర్ణ కళ్లల్లోకి చూసి గిల్టీగా ఫీలవుతాడు. తనలో తనే ఏదో గొణుక్కుంటూ వుంటాడు. తిండి సంజుతున్నాడేగానీ, వొంట పడుతున్న సూచనలు లేవు. ఐఐటీ పరీక్ష రోజు వచ్చేసింది. ససేమిరా రాయనని భీష్మించుక్కూచ్చున్నాడు. నారాయణా, గాయత్రీ, అపర్ణా- ఒకటే ఏడుపు. బ్రతిమిలాడటం. వినలేదు. నగరాజూ, లలితా అసలతన్ని కదిలించాలంటే భయపడసాగేరు. నాగరాజు ఎవరో ట్యూషన్ లెక్చరర్‌ని ఇంటికి తీసుకొచ్చి మాట్లాడించాడు. "సారీ, సార్. నన్నొదిలెయ్యండి" అనే మాట తప్ప మరో పలుకు లేదు కిశోర్.

కిశోర్ వాలకాన్ని గమనిస్తూనే వున్నారు- తల్లిదండ్రులూ, అపర్ణా. పొడిపొడిగా మాట్లాడుతున్నాడు. ముభావపు లక్షణం వచ్చేసింది. కళ్లల్లో ఎర్రజీరలు. ఎప్పుడూ ఏదో పరధ్యానం, ఆలోచన. రాత్రులు నిద్రపోవడం లేదు. పిడికిళ్లు బిగించి, పెదవులు వణికిస్తూ- తనలో తాను ఏదో మాట్లాడుకుంటూ ఉంటాడు.

తీగెలాగి కట్టిన తంబురాలా ఉన్నాడు. మాల్ వంటి వస్తున్న మార్పులకి- న్యాయానికి- కిశోర్ అనుకూలం- అతని భావజాలం దానికి వ్యతిరేకమే కాదు. అట్టాంటి తనను- తన ప్రమేయం లేని వ్యవహారంలో ఇరికించారని కిశోర్ మానసికంగా పెద్ద దెబ్బ తిన్నాడు! దానికి తోడు దైహికంగానూ పోలీసులు అంతో ఇంతో హింసించారు. ఇదీ అతనికి లోలోపలి ఆవేదన; కసి. జరిగినదాన్ని అవమానంగా భావిస్తున్నాడు.

అగ్నిపర్వతంలా కుతకుతలాడుతున్నాడు. ఇప్పుడో, మరికాస్సేపటికో పేలబోయే డైనమైట్‌లా ఉన్నాడతను.

అతని మనస్సులోని తుఫాను గురించి విడమర్చి చెప్పింది అపర్ణ. అందరి మనస్సుల్లోనూ అతన్ని గురించిన అశాంతే!

కొడుకు గురించి ఆలోచిస్తున్నకొద్దీ, నారాయణ మనసంతా గొడ్డు తొక్కేసిన బీరతోటలా తయారైంది. దానికితోడు- నారాయణకీ, గాయత్రికీ కొత్త సమస్య వచ్చి పడింది. అతని తల్లి- ముసలావిడ నోరూరుకోదు. ఏదో ఒకటి అంటూనే వుంటుంది. అన్ని వివరాలూ కావాలి. చెప్పకపోతే నస, సణుగుడు, నిష్ఠూరాలు. గాయత్రి తన సహనం మొక్కకి మళ్లీ నీరు పెట్టుకోవాల్సి వస్తోంది.

***

ఆరోజు- ఆ కుటుంబానికి చాలా దుర్దినం.


కిశోర్ ఇంట్లో నుంచీ వెళ్లిపోయాడు!

నిజానికి, ఆ రోజు నుంచీ అన్ని రోజులూ దుర్దినాలే! ఎవరికీ మనసు మనసులోలేదు. తిండీ తిప్పలూ లేవు. బుర్ర పనిచేయటం మానేసింది. రోజులు గడుస్తున్నై. కిశోర్ ఎక్కడికి వెళ్లాడో, ఏం చేస్తున్నాడో ఎవ్వరికీ తెలియలేదు. పోలీస్ కంప్లయింట్‌లూ, వెదుకులాటలూ సాగిపోయినై. ఫలితంలేని పరుగు జరుగుతోంది. ఆచూకీ లేదు.

రోజులు నెలలైనాయి. నెలలు సంవత్సరమైనాయి.

నారాయణ ఆరోగ్యం పూర్తిగా పాడయిపోయింది. మార్కెట్‌లో చాలా మంది దుకాణాలు దెబ్బతిన్నాయి. నారాయణ తన దుకాణాన్ని అమ్మేసి అపర్ణ పెళ్లి చేసేశాడు. అల్లుడు ఏదో కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు.

***



మార్కెట్ వర్సెస్ మాల్: తాము కోల్పోతున్నదేమిటో దుకాణదారులకి తెలుస్తూనే వుంది. కానీ, దాన్ని తిరిగి పొందటానికి వ్యూహం? తెలియటంలేదు.

ఇప్పుడు- ఓపికున్న రోజుల్లో నారాయణ కాలనీల్లో తిరుగుతూ బండిమీదే కాయగూరలమ్ముకుంటున్నాడు.

వీధుల్లో తిరుగుతున్నప్పుడంతా- పగిలిన పత్తికాయల్లాంటి అతని కళ్లు ఆశగా కిశోర్ కోసమే ఎదురుచూస్తూ వుంటాయి!

ఇక్కడ ఇంట్లో గాయత్రి కళ్లూ అంతే- అవి దిగులు వాకిళ్లు!!

'మా అమ్మ కళ్లు- ఆశల లోగిళ్లు' అంటుంది అపర్ణ. •